
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వార్తలు

గురువారం 11 ఏప్రిల్ 2024 | 5





ఇవే గుర్తుపెట్టుకోండి : గుర్తులను చూపుతున్న పవన్‌కల్యాణ్

వారాహికి.. జన హారతి

నిడదవోలు : పవన్‌కల్యాణ్‌కే కాదు.. పవన్‌కల్యాణ్ వాహనం వారాహికి విశేష స్పందనే.. నిడదవోలు గణేష్ చౌక్ సెంటర్‌లో బుధవారం జరుగుతున్న వారాహి విజయభేరి సభకు వచ్చిన వారాహి వాహనాన్ని తిలకించేందుకు అటు టీడీపీ, ఇటు జనసేన, బీజేపీ శ్రేణులు సాయంత్రం ఐదు గంటలకే పెద్దఎత్తున తరలివచ్చారు. తొలిసారి నిడదవోలు విచ్చేసిన వారాహి వాహనానికి అభిమానులు హారతులు పట్టారు. వారాహి వాహనం రాకతో నిడదవోలు గణేష్‌చౌక్ సెంటర్ అంతా సభ ప్రారంభానికి ముందుగానే జనసంద్రంగా మారింది.

జన సేనానులు

జనసేనలో చేరికలు





చంద్రబాబు, పవన్‌లకు నీరాజనం

- నిడదవోలు సభకు పోటెత్తిన జనం
- 20 వేల మందిపైగా వచ్చారని అంచనా
- దద్దరిల్లిన సభా ప్రాంగణం

నిడదవోలు /ఉండ్రాజవరం, ఏప్రిల్ 10 : జనసేనానుల రాకతో ఎటు చూసినా జనం.. జనం.. నిడదవోలు ప్రజాగళం సభ దద్దరిల్లింది. వారాహి విజయభేరిగా ఈ సభ మార్మోగింది. తొలిసారిగా ఒకే వేదిక మీద ఎన్నికల సభలో టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి కలిసి గర్జించడంతో టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణుల్లో భలే ఊపు వచ్చింది. నిడదవోలు పట్టణంలోని గణేష్‌చౌక్ సెంటర్ అంతా జనసంద్రంగా మారింది. సాయంత్రం ఐదు గంటల నుంచే పరిసర గ్రామాల నుంచి ప్రజలు ప్రజాగళం సభకు భారీగా తరలివచ్చారు. నాయకులు మాట్లాడుతున్నంతసేపు జైచంద్రబాబు, జైపవన్‌కల్యాణ్ అంటూ ప్రజలు ఆ పార్టీ జెండాలతో సందడి చేస్తూనే ఉన్నారు.ఈ జనాన్ని చూసి చంద్రబాబు మిమ్మల్ని చూస్తుంటే నాకు అర్థం అయిపోయింది. జగన్‌ను ఇంటికి పంపడానికి మీరు ఇప్పటికే నిర్ణయం చేశారు. మే 13 ఇక లాంఛనం మాత్రమే అనడం గమనార్హం. ఈ మూడు పార్టీలు ఎందుకు కలిశాయో పవన్‌కల్యాణ్ వివరించి చెప్పడం గమనార్హం. దుర్మార్గుడైన జగన్‌ను ఓడించడం కోసం, యువత ఉపాధి కోసం, రాష్ట్ర అభివృద్ధి కోసం ఐక్యమయ్యాయన్నారు. కూటమి అధికారంలోకి రాగానే సమస్యలను చకచకా పరిష్కరిస్తామన్నారు. ఎంపీ అభ్యర్థి పురందేశ్వరి మాట్లాడుతూ ఏన్డీఏ విజయంతో రాష్ట్రానికి మేలు జరుగుతుందన్నారు. నిడదవోలు నియోజకవర్గంలో అన్ని సమస్యలను పరిష్కరిస్తామని పవన్‌కల్యాణ్ హామీ ఇచ్చారు. నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బూరుగుపల్లి శేషారావు పెద్ద మనస్సుతో ఇక్కడ జనసేన అభ్యర్థి కందుల దుర్గేష్ పోటీచేయడానికి సహకరించినందుకు పవన్ కృతజ్ఞతలు తెలిపారు. నిడదవోలు చిన్న కాశీ రేవుకు వెళ్లే వంతెన నిర్మాణంతోపాటు వంద పడకల ఆసుపత్రి పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. డంపింగ్ యార్డు సమస్యను పరిష్కారం చేస్తాం. గోదావరి జలాలను పట్టణ ప్రజలకు అందేలా చర్యలు చేపడతాం. ఇండోర్ స్టేడియం నిర్మిస్తాం. నిడదవోలు, సమిశ్రగూడెం మధ్యలో ఉన్న పురాతన హేవ్‌లాక్ బ్రిడ్జి స్థానంలో కొత్తది నిర్మిస్తాం. కంసాలిపాలెం -మాధవరం బ్రిడ్జిని పునరుద్ధరిస్తామని పవన్ చెప్పారు. నిడదవోలు మండలంలోని ఆంజనేయపురం, శింగవరంలో చంద్రబాబునాయుడు నిర్మించిన టిడ్కో ఇళ్లను కూటమి ప్రభుత్వం రాగానే లబ్ధిదారులకు అందిస్తాం. పెరవలిలో బస్టాండ్ నిర్మిస్తాం. పెరవలి ప్రభుత్వాసు పత్రిలో నేషనల్ హైవే వద్ద అడ్డుగా ఉన్న కటింగ్‌ను తొలగించి రోడ్డును అభివృద్ధిచేసి ప్రజలు, అరటి రైతులకు అనుకూలంగా మారుస్తాం. కానూరు-నడిపల్లి-తణుకు రోడ్డును ఆధునికీకరిస్తాం. ముక్కామల పెరవలి రహదారిని ఆధునికీకరిస్తాం. మర్రిపాలెం బ్రిడ్జిని విస్తరింపజేస్తాం. జగన్ పాలనలో నిడదవోలు నియోజకవర్గ పరిధిలోని రోడ్లన్నీ గుంతలమయం అయ్యాయి. తమ కూటమి ప్రభుత్వం వచ్చిన మూడు నెలల సమయంలోనే రోడ్ల నిర్మాణం చేపట్టడానికి చర్యలు తీసుకుంటామని పవన్ కల్యాణ్ హామీ ఇచ్చారు. 3 నెలల్లో నియోజకవర్గంలో రహదారులను అభివృద్ధి పరుస్తామన్నారు.నిడదవోలు ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కందుల దుర్గేష్ మాట్లాడుతూ వారాహి విజయభేరి సభలో వారాహి వాహనంపై రెండు సింహాలు నిలబడ్డాయన్నారు. ఓపక్క నారా వారి సింహం, మరోపక్క కొణిదెల వారి సింహం అప్రజాస్వామిక పరిపాలన చేస్తున్న వైసీపీని తరిమికొట్టేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు. రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందాలంటే ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రావాలన్నారు. ఉమ్మడి ఎంపీ అభ్యర్థిగా దగ్గుబాటి పురందేశ్వరి, ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థిగా కందుల దుర్గేష్‌లను కమలం, గాజు గ్లాసు గుర్తులపై ఓటేసి ప్రజలు ఆశీస్సులు అందించాలన్నారు. నిడదవోలు వారాహి సభలో పట్టణ ప్రముఖ వైద్యులు. డాక్టర్ తోపరాల కళ్యాణచక్రవర్తికి జనసేన అధినేత పవన్‌కల్యాణ్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నిడదవోలు పట్టణ వైసీపీ నాయకుడు గంటా శ్రీనివాస్, వైసీపీ మాజీ కౌన్సిలర్ గంటా నాగశాంతికుమారిలను పవన్ జనసేనలోకి ఆహ్వానించారు.

అడుగడుగునా అభిమానం

పశ్చిమగోదావరి జిల్లా తణుకులో రాత్రి 7 గంటలకు ప్రజాగళం సభ ముగించుకుని టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ రోడ్డు మార్గాన నిడదవోలు బహిరంగ సభకు బయలుదేరారు. తణుకులో రోడ్‌షో ముగిసిన తరువాత సుమారు 20 కిలోమీటర్లు ఒకే వాహనంపై చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లు నిడదవోలు చేరుకున్నారు. సుమారు 8-43 గంటలకు నిడదవోలు సభావేదిక వద్దకు చేరుకున్నారు. వారాహి వాహనం ఎక్కి ప్రజలకు అభివాదం చేశారు. నిర్ణీత సమయానికంటే గంటకు పైగా అధినేతల రాక ఆలస్యమైనప్పటికి జనం ఉత్సాహంగా రాత్రి 10 గంటల వరకు అక్కడు ఉండడం గమనార్హం. తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలంలోకి వచ్చేసరికి వారికి ఇరుపార్టీల శ్రేణులు ఘనస్వాగతం పలికారు. పాలంగి, ఉండ్రాజవరం, మోర్త, దమ్మెన్ను, కానూరు, డి.ముప్పవరం మీదుగా నిడదవోలు వెళ్లారు. ఉండ్రాజవరంలో మాజీ సర్పంచ్, టీడీపీ నాయకుడు గన్నమని వెంకటసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. నిడదవోలు రూరల్ మండలం మునిపల్లి గ్రామంలో మహిళలు నేతలిద్దరిపై పూలు జల్లారు. డి.ముప్పవరంలో కూడ ప్రజలకు అభివాదం చేస్తూ సుమారు 7.45 గంటలకు నిడదవోలు పట్టణంలో గణేష్‌చౌక్ సెంటర్‌లో ఉన్న వారాహి విజయభేరి సభకు చేరుకున్నారు. ఉండ్రాజవరం నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మోటార్ సైకిళ్లపై కాన్వాయ్ వెంట వచ్చారు. ఒకే వాహనంపై రోడ్‌షో నిర్వహిస్తున్న చంద్రబాబు, పవన్‌లకు ప్రజలు విజయ సంకేతం చూపారు. 8.45 గంటలకు వారాహి వేదిక మీదకు వచ్చిన టీడీపీ, జనసేన అధినేతలు చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లు, రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, నిడదవోలు నియోజకవర్గ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కందుల దుర్గేష్ సభను ఉద్దేశించి ప్రసంగించారు. 8.45 గంటలకు ప్రారంభమైన వారాహి విజయభేరి సభ 9.50 గంటలకు ముగిసింది. 20 వేల మందికిపైగా జనం రాకతో వారాహి విజయభేరి సభ విజయవంతమైంది. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి కేఎస్ జవహర్, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, నిడదవోలు నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి భోగవల్లి ప్రసాద్, సుజయ కృష్ణరంగారావు, గన్ని వీరాంజనేయులు, బొలిశెట్టి శ్రీనివాస్, గోరంట్ల బుచ్చయ్యచౌదరి, పితాని సత్యనారాయణ, బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ, బొమ్మల దత్తు తదితరులు పాల్గొన్నారు.



మీకు మేమున్నాం : బహిరంగ సభలో మాట్లాడుతున్న చంద్రబాబు



సభకు హాజరైన టీడీపీ నాయకులు



అభిమాన జెండా : జనసేన జెండాలతో పవన్ అభిమానులు



పవన్ అన్న వెంటే : పవన్ చిత్రాలతో యువత

నేడు అంబాజీపేట, అమలాపురంలలో బాబు, పవన్ షో!

అమలాపురం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ప్రజాగళం పేరుతో గురువారం టీడీపీ,జనసేన అధినేతలు నారా చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్ రోడ్ షో,బహిరంగ సభలు నిర్వహించనున్నారు.అధినేతల ఎన్నికల ప్రచార కార్యక్రమానికి అంబాజీపేట,అమలాపురం ప్రాంతాలు వేదిక కానున్నాయి. నిడదవోలులో బుధవారం రాత్రి బహిరంగ సభ అనంతరం తిరుమలసాయి కల్యాణమండపంలో బస చేస్తారు.ఉదయం 11 గంటల నుంచి 11.30 గంటల వరకూ రంజాన్ వేడుకల్లో పాల్గొంటారు.1.30 గంటల వరకు పార్టీ నాయకులతో సమీక్ష, చేరికలు ఉంటాయి. అనంతరం 2.30 గంటల వరకూ గంట పాటు భోజన విరామం. పర్యటన ముగించుకుని మధ్యాహ్నం 3 గంటలకు బ్రాహ్మణగూడెం నుంచి హెలికాప్టర్‌లో చంద్రబాబు బయలుదేరతారు. పవన్ కల్యాణ్ రాజమహేంద్రవరంలోని హోటల్ షెల్టాన్ నుంచి బయలుదేరతారు. వీరిద్దరూ గురువారం మధ్యాహ్నానికి అంబాజీపేటలో వేర్వేరుగా ఏర్పాటుచేసిన హెలిపాడ్‌లకు చేరుకుంటారు. జనసేనకు పట్టున్న అమలాపురం, పి.గన్నవరం నియోజకవర్గాల్లో తొలి విడత పర్యటనలో భాగంగా ఇద్దరు నేతలు గురువారం పర్యటించి ఆయా పార్టీల కేడర్‌లో జోష్ నింపనున్నారు.ఈ సభలను విజయవంతం చేయాలని కోరుతూ ఏర్పాటుచేసిన ప్రచార రథాలను జనసేన నేత ఆకుల బుజ్జి ఆధ్వర్యంలో టీడీపీ అమలాపురం అభ్యర్థి ఆనందరావు ప్రారంభించారు. బుజ్జి ఆధ్వర్యంలో మోటారు సైకిల్ ర్యాలీ కూడా చేపట్టారు.ఎక్కడికక్కడే టీడీపీ, జనసేన నాయకులు గురువారం జరిగే ఉభయ నేతల సభకు భారీగా జనాన్ని తరలించేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. అంబాజీపేటలో బహిరంగ సభ ముగిసిన తరువాత చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఒకే వాహనంలో అక్కడి నుంచి రోడ్ షో నిర్వహిస్తూ అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లో నిర్వహించే సభాస్థలికి చేరుకుంటారు. సుమారు 6 కిలోమీటర్ల మేర జరిగే రోడ్ షోకి జనం భారీగా హాజరవుతారని అంచనా వేస్తున్నారు. అమలాపురం బహిరంగ సభ ముగిసిన తరువాత టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు కిమ్స్‌లో నైట్‌హాల్ట్ చేస్తారు. శుక్రవారం మధ్యాహ్నం వరకు చంద్రబాబు కిమ్స్‌లోనే ఉండి అమలాపురం లోక్‌సభ, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో పార్టీ పరిస్థితులపై జిల్లా నాయకులతో చర్చిస్తారని సమాచారం.



రాత్రి బస ఇక్కడే..

నిడదవోలులోని శ్రీ తిరుమల సాయి కళ్యాణ మండపంలో చంద్రబాబు బుధవారం రాత్రి బస చేశారు. గురువారం ఉదయం జిల్లా నేతలతో సమీక్షించి అంబేద్కర్ కోనసీమ జిల్లాకు వెళతా రు.జనసేన అధినేత పవన్‌కల్యాణ్ కారులో బయలుదేరి రాజమహేంద్రవరం షెల్టాన్ హోటల్‌లో రాత్రి బస చేశారు.

పసుపు చంద్రయ్య

తెలుగుదేశం అంటే ప్రాణం. ఆనాడు అన్న ఎన్‌టీఆర్ నుంచి నేడు చంద్రబాబు వరకు ఎక్కడ టీడీపీ సభలు, సమావేశాలు జరిగినా అతను విధిగా హాజరవుతాడు.. అతని వస్త్రాలే కాదు.. బండి సైతం పసుపు మయం. చాగల్లు మండలం నందింగంపాడుకు చెందిన చిట్టూరి జలచంద్రయ్య బుధవారం నిడదవోలులో గణేష్‌చౌక్ సెంటర్‌లో జరుగుతున్న వారాహి విజయభేరి సభకు తాను మోటారుసైకిలును సైతం పసుపుమయం చేసుకుని జయహో చంద్రన్నా... జయహో పవనన్నా.. అంటూ ఇలా సభకు తరలి వచ్చాడు.



సాగునీటి ఎద్దడి

పాశర్లపూడి బాడవలో బీటలు వారుతున్న వరి చేలు

మామిడికుదురు, ఏప్రిల్ 10: పాశర్లపూడి బాడవలోని షిర్డిసాయిబాబా ఆలయం వెనుక ప్రాంతంలో వరిచేలు సాగునీరు అందక బీటలు వారడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంట పాలు పోసుకునే దశలో నీరు లేక అపార నష్టం సంభవించేలా ఉందన్నారు. సుమారు 70 ఎకరాల వ్యవసాయ భూములకు నెల రోజులుగా నీరు లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. సాగునీటి సమస్యను అధికారులకు విన్నవించినా పట్టించుకోవట్లేదని వాపోయారు. ప్రధాన పంటకాల్వకు ఇరువైపులా మోటార్లు పెట్టి కొబ్బరి తోటలకు నీరు మళ్లించడం వల్ల సాగునీటి ఎద్దడి తలెత్తిందని రైతులు చెప్పారు. పంట చేతికి అందే సమయంలో సాగునీరు అందక నష్టం వాటిల్లే ఆస్కారం ఉందన్నారు. అదే విధంగా నగరంలోని కార్పొరేషన్ బ్యాంకు వెనుక ప్రాంతంలో సుమారు 40 ఎకరాల వ్యవసాయ భూమికి సాగునీరు లేక పంట నష్టపోయే పరిస్థితిలో ఉన్నామని వివ రించారు. పంట చివరి సమయంలో అవసరమైన సాగునీరు అందించి పంట చేతికి అందేలా చూడాలని రైతులు కోరుతున్నారు.





పాశర్లపూడిలో బీటలు వారిన వరి చేను, ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులు

నష్టాల ఊబిలో చేనేత సహకార సంఘాలు

- 'నేతన్న నేస్తం'తో రాయితీలన్నీ కట్
- కార్మికులకు ఉపాధి కల్పించలేని దుస్థితి
- కొత్త ప్రభుత్వంలోనైనా ఎన్నికలు జరిగేనా!

అమలాపురం రూరల్, ఏప్రిల్ 10: రాష్ట్ర విభజన అనంతరం చేనేత సహకార సంఘాలకు ఇంతవరకూ ఎన్నికలు నిర్వహించలేదంటే పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ పార్టీ నాయకులు, అధికారులే పాలకవర్గాలుగా కొనసాగుతున్నారు. పట్టించుకునే నాథుడు లేకపోవడంతో చేనేత సహకార సంఘాల పరిస్థితి దయనీయంగా మారింది. నేతనేసే కార్మికులకు మాత్రమే 'నేతన్న నేస్తం' అందిస్తూ చేనేతలో కీలక విభాగాల్లో పనిచేసే కార్మికులను పట్టించుకోకపోవడంతో వారి పరిస్థితి దుర్భరంగా మారింది. 'నేతన్న నేస్తం ' అందిస్తున్న జగన్ ప్రభుత్వం అప్పటివరకు చేనేత సహకార సంఘాలకు, కార్మికులకు అందిస్తున్న అన్ని సంక్షేమ పథకాలు, రాయితీలకు మంగళం పాడింది. కార్మికులకు ఉపాధికల్పించలేని పరిస్థితుల్లో సంఘాలు అప్పుల ఊబిలో కూరుకుపోయి ఎప్పుడు ఏ సంఘం మూతపడుతుందో తెలియని అయోమయ పరిస్థితి జిల్లాలో ఉంది.

చేనేత సహకార సంఘాలకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2013 ఫిబ్రవరి 12న ఐదేళ్ల కాలపరిమితికి ఎన్నికలు జరిగాయి. పదవీ కాలం 2018 ఫిబ్రవరితో ముగిసింది. విభజిత ఆంధ్రప్రదేశ్‌లో అదే పాలకవర్గాలు ఆరు నెలల కాపపరిమితితో పని చేశాయి. 2019 ఆగస్టు వరకు అవే పాలకవర్గాలు కొనసాగాయి. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం అప్పటివరకు కొనసాగుతున్న పాలకవర్గాలను రద్దుచేసి పర్సన్-ఇన్‌చార్జిలుగా చేనేత సహకార సంఘాలకు ప్రత్యేక అధికారులను నియమించింది. ఆరు నెలల కాలపరిమితితో మూడు పర్యాయాలు ప్రత్యేక అధికారుల పాలన కొనసాగింది. 2021 ఫిబ్రవరి నెల నుంచి ప్రత్యేక అధికారుల పాలనను రద్దుచేసి వారి స్థానే ఐదుగురు సభ్యులతో కూడిన నామినేటెడ్ కమిటీలను వైసీపీ నాయకులు, కార్యకర్తలకు కట్టబెట్టారు. సుప్రీంకోర్టులో కేసు పెండింగులో ఉన్నందున కోర్టు తీర్పుకు లోబడి ఆరు నెలల కాలపరిమితితో ఇప్పటివరకు ఐదు పర్యాయాలు ఫైవ్‌మెన్ కమిటీలను కొనసాగిస్తూ వచ్చారు. మళ్లీ అధికారులకే సహకార సంఘాల నిర్వహణ బాధ్యతను అప్పగించారు. 2018లో చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉండగా సార్వత్రిక ఎన్నికలు దగ్గర పడడంతో పాలకులు పట్టించుకోలేదు. 2023లో చేనేత సంఘాలకు రెండోసారి ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్నా జగన్ ప్రభుత్వం కనీసం పట్టించుకోలేదు. ఏడేళ్లుగా పాలకవర్గ ఎన్నికలు లేకుండానే చేనేత సంఘాలు కొనసాగుతున్నాయి. చేనేతకు మాతృ సంస్థ అయిన ఆప్కో సహకార సంఘాల నుంచి కొనుగోళ్లు చేయకపోవడంతో వస్త్ర నిల్వలు పేరుకుపోయాయి. లావాదేవీలు స్తంభించిపోవడంతో కార్మికులకు ఉపాధి కల్పించలేని పరిస్థితి ఏర్పడింది.

రాయితీలన్నీ ఎత్తేశారు..

గతంలో టీడీపీ, కాంగ్రెస్ పాలనల్లో చేనేత సహకార సంఘాలకు, కార్మికులకు ప్రభుత్వపరంగా ఎన్నో రాయితీలు, సంక్షేమ పథకాలు అమలు జరిగేవి. ఒకే ఒక 'నేతన్న నేస్తం' పథకం పేరుతో సంక్షేమ పథకాలకు, రాయితీలకు వైసీపీ ప్రభుత్వం మంగళం పాడేసింది. పోనీ నేతన్న నేస్తాన్ని చేనేత కార్మికులందరికీ వర్తింపజేస్తోందా అంటే అదీ లేదు. మగ్గం నేస్తున్న కార్మికులకు మాత్రమే ఆ పథకాన్ని వర్తింపజేస్తూ కీలకమైన సరిజట్లు, జంత్రం విసిరే కార్మికులు, రంగుల అద్దకం వంటి విభిన్న పనుల్లో పనిచేసే కార్మికులను వదిలేశారు. అన్ని విభాగాల కార్మికులకూ 'నేతన్న నేస్తం' వర్తింపజేయాలని డిమాండు చేస్తున్నారు.

ఐదు సంఘాలు మినహా..

జిల్లాలో 23 చేనేత సహకార సంఘాలు ఉండగా కె.జగన్నాథపురం, హసన్‌బాద, శివల, రాయవరం, మండపేట కొద్దిపాటి లాభాల్లో ఉన్నాయి. మిగిలిన అన్ని సంఘాలు రూ.50లక్షల నుంచి రూ.కోటికిపైనే నష్టాల్లో ఉన్నాయి. ఆయా సంఘాలు కోలుకునే పరిస్థితులు లేవు. దానికి తోడు కొన్ని సంఘాలు మూసివేతకు సిద్ధంగా ఉన్నాయి. గతంలో చేనేత సహకార సంఘాలకు నగదు పరపతిపై పావలా వడ్డీ రాయితీ ఉండేది. ఆ పథకాన్నీ జగన్ ప్రభుత్వం రద్దు చేసింది. దానికితోడు నగదు పరపతిపై వడ్డీ రేటును మరింత పెంచడంతో చేనేత సంఘాల మనుగడ కష్టసాధ్యమని చేనేత నాయకులు చెప్తున్నారు. అవసానదశలో ఉన్న చేనేత సంఘాలను ఆదుకోవడంతోపాటు కార్మికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని చేనేత నాయకులు అంకం వీర్రాజు, చింతా శంకరమూర్తి, పిచ్చిక శ్యామ్ కోరుతున్నారు. రాష్ట్రంలో త్వరలో ఏర్పడే కొత్త ప్రభుత్వమైనా చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని కోరుతున్నారు. వస్త్రాల అమ్మకాలపై 30శాతం రాయితీ కొనసాగించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

రేపు ఈవీఎంల పరిశీలన

అమలాపురం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను పోలింగ్ సిబ్బంది శుక్రవారం పరిశీలిస్తారని కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. ముమ్మిడివరం ఎయిమ్స్ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగే ఈ ప్రక్రియలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు భాగస్వాములు కావాలని ఆయన కోరారు. బుధవారం కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. నామినేషన్లు దాఖలు చేసే ప్రక్రియలో తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. పోటీ చేయదలచిన అభ్యర్థులకు నేర చరిత్ర, క్రిమినల్ కేసులు ఉంటే ప్రసార మాధ్యమాల్లో మూడుసార్లు ప్రకటనలు ఇవ్వాలన్నారు. నామినేషన్ల చివరి రోజు మధ్యాహ్నం 3 గంటలలోపు పార్టీ తరఫున బి-ఫారాలు సమర్పించకపోతే స్వతంత్ర అభ్యర్థులుగా ప్రకటిస్తామని తెలిపారు. సమావేశంలో ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ టి.వైద్యనాథశర్మ, రవిశంకర్, కామన ప్రభాకరరావు (కాంగ్రెస్), దూరి రాజేష్ (బీజేపీ), సంసాని చంద్రశేఖర్ (వైసీపీ), కాశి లక్ష్మీభవానీ (బీఎస్పీ), కారెం వెంకటేశ్వరరావు (సీపీఎం) పాల్గొన్నారు.

తనిఖీల్లో రూ.1.96 లక్షల నగదు సీజ్

అమలాపురం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎస్పీ ఎస్.శ్రీధర్ ఆధ్వర్యంలో ఎఫ్ఎస్టీ, ఎస్ ఎస్టీ, పోలీసులు నిర్వహించిన విస్తృత తనిఖీల్లో రామచంద్రపురం, సఖినేటిపల్లి పోలీసుస్టేషన్ల పరిధిలో రూ.1,96,310 నగదును సీజ్ చేసినట్టు ఎస్పీ కార్యాలయం బుధవారం ఓ ప్రకటనలో తెలిపింది. ఉప్పలగుప్తం, ఐ.పోలవరం పీఎస్‌ల పరిధిలో ఎన్నికల ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో భాగంగా ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి మూడు ఎన్డీపీ లిక్కర్ సీసాలు, 1.25 లీటర్ల ఐఎంఎల్, 19 డ్యూటీ పెయిడ్ లిక్కర్ సీసాలు, 3.42లీటర్ల ఐఎంఎల్ స్వాధీనం చేసుకుని రెండు కేసులు నమోదు చేశారు. ఆత్రేయపురం పీఎస్ పరిధిలో 40 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని 200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి ఒక వ్యక్తిని అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన దాడుల్లో ఎనిమిది మందిని అరెస్టు చేసి లిక్కర్ సీసాలను స్వాధీనం చేసుకుని ఎనిమిది కేసులు నమోదు చేశారు. చెక్‌పోస్టుల వద్ద తనిఖీలను ముమ్మరంగా నిర్వహిస్తున్నారు.



పోటాపోటీగా నాటిక ప్రదర్శనలు


చీకటి పువ్వు నాటికలోని ఓ సన్నివేశం

రావులపాలెం, ఏప్రిల్ 10: రావులపాలెం సీఆర్సీ కాటన్ కళా పరిషత్ వేదికపై రెండో రోజైన బుధవారం నాటిక పోటీలు పోటాపోటీగా సాగాయి. ప్రేక్షకులను ఆద్యంతం ఆకట్టుకున్నాయి. మొదటి నాటికగా చైతన్యకళాభారతి కరీంనగర్ వారి 'చీకటిపువ్వు' నాటికను ప్రదరించారు. రమేష్ మంచాల దర్శకత్వం వహించగా పరమత్ముని శివ రామ్ నాటకీకరణ చేశారు.. సురభి నాగరాజు సంగీతం, గానం అందించారు. ఆహార్యం, రంగాలంకరణ, లైటింగ్ వ్యవహారకర్తగా కేదారి నాగు ఉన్నారు. రెండో నాటికగా సిరిమువ్వ కల్చరల్స్ హైదరాబాద్ వారి 'థింక్'ను ప్రదర్శించారు. మంజునాథ్ రచన, దర్శకత్వం వహించారు. సురభి నాగరాజు సంగీతం సమకూర్చారు. ఆహార్యం మల్లాది గోపాలకృష్ణ వ్యవహరించారు. మూడో నాటికగా మల్లాది క్రియేషన్స్ హైదరాబాద్ వారి 'చీకట్లో చంద్రుడు' అనే హాస్య నాటికను ప్రదర్శించారు. మల్లాది రవికిరణ్, దర్శకుడిగా తేజోమూర్తుల మురళీధర్ వ్యవహరించారు. సంగీతం సురభి నాగరాజు అందించారు. ఆహార్యం బీవీ రావు వ్యవహరించారు. నాటికలన్ని ఆకట్టుకునే విధంగాను, సందేశాత్మకంగా ఉన్నాయి.

మే 19న సత్యదేవుని దివ్య కల్యాణం

- మే 18 నుంచి 24 వరకు కల్యాణోత్సవాలు
- గోటి తలంబ్రాల కార్యక్రమం రద్దు
- సమీక్షలో పలు నిర్ణయాలు తీసుకున్న అధికారులు


సమీక్ష నిర్వహిస్తున్న ఈవో రామచంద్రమోహన్

అన్నవరం, ఏప్రిల్ 10: రత్నగిరివాసుడైన సత్యదేవుడికి వార్షిక దివ్యకల్యాణోత్సవాల నిర్వహణపై బుధవారం ఈవో రామచంద్రమోహన్ అధ్యక్షతన వైదిక కమిటీ, అన్ని విభాగాల ఏఈవోలు, సూపరింటెండెంట్‌లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. క్రోధి నామ సంవత్సర స్వామి వారి దివ్య కల్యాణోత్సవాలు మే 18న వైశాఖ శుద్ధ దశమి రోజున స్వామి, అమ్మవార్లను పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెలు చేయడంతో ప్రారంభమై 24న శ్రీపుష్పయాగంతో ముగుస్తాయి. 19న రాత్రి 9 గంటలకు అంగరంగ వైభవంగా దివ్య కల్యాణం నిర్వహిస్తారు. గతేడాది గోటి తలంబ్రాలుతో కల్యాణం అక్షింతలు తయారుచేయగా ఆ సంప్రదాయం అన్నవరం సత్యదేవుడికి లేనందున పూర్వపు పద్ధతిలో మామూలుగా కల్యాణ అక్షింతలు తయారుచేయాలని సుమారు 10వేల ప్యాకెట్లను సిద్ధం చేయాలని సూచించారు. అదే విధంగా గతేడాది స్వామి,అమ్మవార్ల శ్రీపుష్పయోగం ఆరుబయట వార్షిక కల్యాణవేదిక వద్ద చేపట్టడం దీనిపై విమర్శలు రావడం, పలువురు దీనిపై ఫిర్యాదులు చేయడంతో అనివేటి మండపంలో చేపట్టాలని నిర్ణయించారు. ఈ ఏడాది కల్యాణోత్సవాలకు ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున రాజకీయనాయకులకు ఆహ్వానాలు పంపకుండా దేవదాయ కమిషనర్, ప్రిన్సిపల్ సెక్రటరీ, జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీలను మాత్రమే ఆహ్వానించనున్నారు. కల్యాణోత్సవాలలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఎక్కడికక్కడ క్యూలైన్‌లు పటిష్టపరిచి నిరంతరాయంగా తాగునీటి సరఫరా జరగాలని ఆదేశించారు. వైదిక కార్యక్రమాల నిర్వహణను వైదిక కమిటీ సంప్రదాయాలను గౌరవించి శాస్త్రోక్తంగా చేపట్టాలని దీనిని వైదిక కమిటీ సభ్యులు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. ఆలయానికి రంగులు, విద్యుద్దీప అలంకరణల విషయంలో రాజీపడొద్దని ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ విభాగ అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా విభాగాల వారీగా కొన్ని లక్ష్యాలను నిర్దేశించారు. వచ్చేనెల మొదటి వారంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం అవుదాయని అప్పటికి నిర్దేశించిన లక్ష్యాలు 90శాతం వరకు పూర్తికావాలని ఆదేశించారు. స్వామివారి దివ్య కల్యాణోత్సవాలకు విస్తృత ప్రచారం కల్పించాలని పీఆర్వో కార్యాలయం దీనిని పర్యవేక్షించాలని సూచించారు. డిప్యూటీ కమిషనర్ రమేష్‌బాబు, ప్రధానార్చకులు కోట సుబ్రహ్మణ్యం, పీఆర్వో దామెర కృష్ణారావు, ఏఈవోలు శ్రీనివాస్, జగ్గారావు, సూపరింటెండెంట్‌లు బలువు సత్యశ్రీనివాస్, ఐ.వి రామారావు, పర్వత నరసింహారావు, అనకాపల్లి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జనసేన తరపున ప్రచారం చేస్తా

పలు ఆలయాల్లో పూజలు నిర్వహించిన హీరో నవదీప్

పిఠాపురం, ఏప్రిల్ 10: పిఠాపురం అసెంబ్లీ నియోజవర్గం నుంచి పోటీ చేస్తున్న జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కే తన మద్దతు అని, ఆయన తరపున ప్రచారం నిర్వహిస్తానని ప్రముఖ హీరో నవదీప్ తెలిపారు. పిఠాపురం పట్టణంలోని శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానంలో లవ్ మౌళి ప్రేమ కథా చిత్రం యూనిట్ సభ్యులు బుధవారం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నవదీప్ మీడియాతో మాట్లాడుతూ నిజాయితీగా ఎవరు పోటీ చేసినా ప్రజలు ఆదరిస్తారని చెప్పారు. పవన్‌కు తన మద్దతు ఎల్లప్పుడు ఉంటుందని, అవసరమయితే ప్రచారానికి వస్తానని తెలిపారు. శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానం చాలా బాగుందని, స్వామిని ప్రత్యక్షంగా కళ్లతో చూసినట్లు ఉందని చెప్పారు. గతంలో తాను ఆలయాలకు వెళ్లేవాడిని కానని, ఇప్పుడు వెళుతున్నానని తెలిపారు.


శ్రీపాద శ్రీవల్లభ సంస్థానంలో నవదీప్, హీరోయిన్స్

హీరో, హీరోయిన్లు పూజలు

లవ్ మౌళి ప్రేమ కథ చిత్రం హీరో నవదీప్ హీరోయిన్లు గిద్వాని, భావనలతో కలిసి మహాసంస్థానంలో పూజలు నిర్వహించారు. వారిని ఆలయ మర్యాదలతో అధికారులు సత్కరించి ప్రసాదాలు అందజేశారు. అనంతరం నవదీప్ మాట్లాడుతూ ఈ సినిమాకు మూడేళ్లుగా ఎంతో కష్టపడి ఇష్టంతో పనిచేశానని తెలిపారు. సినిమా బాగా వచ్చిందని, ప్రేక్షకులు ఆదరిస్తారని ఆకాంక్షిస్తున్నామని చెప్పారు. ఈ నెల 19వ తేదీన సినిమా రిలీజ్ అవుతుందని తెలిపారు. ప్రేమికులకు ఇది గుర్తుండే ఒక కానుకగా ఉంటుందన్నారు. ఈ సినిమా ట్రైలర్‌ను హైదరాబాద్, విశాఖపట్నం, కాకినాడ, రాజమహేంద్రవరం, విజయవాడ, గుంటూరు తదితర ప్రాంతాల్లోని థియేటర్లలో ప్రదర్శిస్తూ ప్రేక్షకుల అభిప్రాయాలను తెలుసుకుంటున్నామని చెప్పారు.

బైక్ ఢీకొని వ్యక్తి మృతి

జగ్గంపేట, ఏప్రిల్ 10: జగ్గంపేట మండలం రామవరం వద్ద బైక్ ఢీకొని వ్యక్తి మృతిచెందాడు. బుధవారం జాతీయ రహదారిపై వీర వెంకటరమణ తన భార్యతో బైక్‌పై వస్తుండగా ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొనడంతో వీర వెంకటరమణకు తీవ్రగాయాలై మృతి చెందాడు. అతడి భార్యకు స్వల్ప గాయాలయ్యాయి. దీనిపై జగ్గంపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నగదు స్వాధీనం

తాళ్లరేవు, ఏప్రిల్ 10: అమలాపురం నుంచి కారులో తుని ప్రాంతానికి తీసుకువెళుతున్న రూ.2,74,000ను పి.మల్లవరం చెక్‌పోస్టు వద్ద ఎస్ఐ రామశేషయ్య ఆధ్వర్యంలో చెక్‌పోస్టు అధికారులు బుధవారం పట్టుకున్నారు. పట్టుకున్న నగదును సీజ్‌చేసి కోరంగ పోలీసు స్టేషన్‌కు స్వాధీనం చేశారు. ఈ నగదుకు సంబంధించిన ఎటువంటి ఆధారాలు లేకపోవడంతో కోరంగి ఎస్ఐ ఎస్.రవికుమార్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అన్నదాన భవన నిర్మాణానికి రూ.లక్ష


దాతలకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, ఏప్రిల్ 10: కోనసీమ తిరుమల వాడపల్లిలో వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి రావులపాలెం మండలం పొడగట్లపల్లికి చెందిన బడే రవికుమార్-రామసత్యవేణి దంపతులు రూ.లక్ష విరాళం సమర్పించారు. దాతలకు ఉప కమిషనరు, ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ స్వామివారి చిత్రపటం అందజేశారు. వివిధ సేవల ద్వారా బుధవారం ఒక్కరోజు ఆదాయం రూ.2,02,021 లభించినట్టు ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు


మాట్లాడుతున్న సీతారాం

పరిహారం ఇవ్వలేని
జగన్‌ను ఓడించాలి

సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మంతెన

చింతూరు, ఏప్రిల్ 10 : పోలవరం పరిహారం, పునరావాసం కల్పించలేని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని ఓడించాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మంతెన సీతారాం పిలుపునిచ్చారు. చింతూరు మండలంలో బుధవారం ఆయన పర్యటించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. పరిహారం పొందిన పోలవరం ముంపు భూములకు తాను అధికారంలోకి వచ్చిన వెంటనే తిరిగి ఎకరాకు రూ. 5 లక్షల వంతున పరిహారం ఇస్తానని నమ్మబలికి చివరకు పునరావాసం కల్పించడంలో చేతులెత్తేసి కేంద్రం ఇస్తేనే తాను ఇవ్వగలనని చెప్పడం ముంపు వాసులందరూ వినే ఉంటారన్నారు. అటువంటి సీఎం మనకు అవసరమా అని ఆయన ప్రశ్నించారు. త్వరలో జరగనున్న ఎన్నికలలో గొంతెత్తి ప్రశ్నించే సీపీఎం అభ్యర్థులను గెలిపించాలని ఆయన కోరారు. ఆదివాసీల జీవితాలకు వెలుగునిచ్చే జీవో నంబరు 3 రద్దు విషయంలో కూడా సీఎం నోరు విప్పకపోవడాన్ని ఆయన తప్పుబట్టారు. నాయకులు సీసం సురేష్, ఎర్రంశెట్టి శ్రీనివాసరావు, పల్లపు వెంకట్, మొట్టం రాజయ్య, మడకం చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

రూ.2 లక్షలు కడితేనే..మృతదేహం ఇస్తాం

- ఓ కార్పొరేట్ ఆస్పత్రి దాష్టీకం
- వైరల్ ఫీవర్‌తో బాధితుడి చేరిక
- రూ.7.50 లక్షల వరకూ ఖర్చు చేసిన కుటుంబం
- మంగళవారం రాత్రి మృతి
- మృతదేహం అప్పగించని ఆసుపత్రి
- మిగిలిన రూ.2 లక్షలు కట్టాలని డిమాండ్

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఓ కార్పొరేట్ ఆస్పత్రి ప్రతినిధులు మానవత్వాన్ని మరిచి ప్రవర్తిస్తున్న తీరు దారుణాతిదారుణంగా ఉంది. వైద్యం కోసం వచ్చిన ఓ పేద వ్యక్తి మృతి చెందితే.. రూ.2 లక్షలు చెల్లిస్తేనే ఇస్తామంటూ మృతదేహాన్ని గదిలో పెట్టి తాళం వేయడంతో కుటుంబీకులు కన్నీరు మున్నీరవుతున్నారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అంతర్వేదికి చెందిన పాటి మోహన్‌రావు(58) వ్యవసాయం చేస్తుంటారు. ఆయనకు వైరల్ జ్వరం సోకడంతో గత నెల 23న కిమ్స్ (బొల్లినేని) హాస్పటల్‌కు తీసుకొచ్చారు. మూడు రోజులు ఐసీయూలో ఉంచి వైద్యం అందించారు. తర్వాత రూమ్‌కు మార్పు చేశారు. మళ్లీ పరిస్థితి విషమించడంతో వెంటిలేటర్ పెట్టారు. కిడ్నీలు పని చేయడం లేదని డయాలసిస్ చేశారు. న్యూమోనియా తీవ్రంగా ఉందని చెప్పారు. ఈ క్రమంలో మోహన్‌రావు చనిపోయారని మంగళవారం రాత్రి 8గంటల ప్రాంతంలో కుటుంబీకులకు చెప్పారు. ఇంకా రూ.2 లక్షలు చెల్లిస్తే మృతదేహాన్ని అప్పగిస్తామన్నారు. అయితే అప్పటికే రూ.7.50లక్షల వరకూ చెల్లించామని.. ఇక తమ వద్ద డబ్బులు లేవని చెప్పడంతో వారితోనే ఫ్రీజర్ బాక్సు రప్పించి దానిలో మృతదేహాన్ని ఉంచారు. ఆ ఫ్రీజర్ బాక్సును ఓ గదిలో పెట్టి తాళం వేశారు. డబ్బులు కడితేనే మృతదేహం ఇస్తామని కరాఖండిగా చెప్పారు. దీంతో మృతదేహం ఇస్తే తీసుకెళ్తామని మంగళ వారం రాత్రి నుంచి ఆస్పత్రి వాళ్లను బాధితులు బతిమలాడుతూనే ఉన్నారు. అయినా ఫలితం లేకపోవడంతో బుధవారం రాత్రి కొంతమంది గురువారం వస్తామని వెనుతిరిగి స్వగ్రామానికి వెళ్లిపోయారు. అయితే గురువారం బాధితులు మృతదేహం కోసం దర్నా చేసే అవకాశముందని సమాచారం.


ఆస్పత్రి ప్రతినిధుల వద్ద బాధితుల ఆవేదన

● ఇదేమి ఆరోగ్యశ్రీ!

మోహన్‌రావుకు ఆరోగ్యశ్రీ కార్డు ఉంది. అయితే ఆయనకు ఆరోగ్యశ్రీ కింద వైద్యం చేయలేదు. ఆయన వ్యాధికి తమ ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీలో వైద్యం చేయలేమని, ఆ వ్యాధికి ఆరోగ్యశ్రీ వర్తించే ఆస్పత్రిలో అయితే ఫలితం ఉంటుందని మెలిక పెట్టారు. ఆస్పత్రిలో చేర్చుకున్న నాటి నుంచీ రోజుకు సుమారు రూ.40 వేల వరకూ వైద్యానికి ఖర్చయింది. ఆ సొమ్ములు అప్పులు చేసి తెచ్చామని బాధితులు చెబుతున్నారు. తమ దగ్గర డబ్బులు లేవని, ఏదో రకంగా తమకు సహాయం చేయాలని ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్‌కు బుధవారం రాత్రి బాధితులు ఫోన్ చేశారు. ఇప్పటి వరకూ కట్టిన సొమ్ములు ఇప్పిస్తే మంచిదని, లేకుంటే మృతదేహాన్ని అయినా అప్పగించాలని కోరారు. ఇంటి వద్ద మహిళలు రోదిస్తూ ఎదురు చూస్తున్నారని చెప్పారు. కానీ కోఆర్డినేటర్ నుంచి ప్రశ్నలు తప్ప ఫలితం లేకపోయింది. పోలీసులు సైతం ఏ సహాయమూ చేయలేమనడంతో తమ గోడు ఎవరికి చెప్పుకోవాలో అనుకుంటూ ఆస్పత్రి వద్దే బాధితులు విలపిస్తూ ఉన్నారు.


మృతదేహాన్ని ఉంచిన గది

న్యాయం చేయండి : కిషోర్ కుమార్, కుమారుడు

మాది పేద కుటుంబం. మంచి వైద్యం అందుతుందని అప్పులు చేసి డబ్బులు చెల్లించినా ఫలితం లేకపోగా మృతదేహాన్ని ఇవ్వమంటున్నారు. రెండు రోజుల కిందట నుంచే పరిస్థితి విషమంగా ఉన్నా ఏదొకటి చేస్తూ నమ్మించారు. 30 గంటలు గడిచి పోయింది. మా నాన్నను కనీసం చూడనివ్వడం లేదు. ఆరోగ్యశ్రీ ఎందుకు పనిచేయదు. ఇది చాలా దారుణం. మాకు న్యాయం చేయాలి.

రామకృష్ణారెడ్డి కోసం నిరవధిక దీక్ష



అనపర్తి, ఏప్రిల్ 10: అనపర్తి నియోజకవర్గ అసెంబ్లీ టిక్కెట్ కేటాయింపులో భాగంగా టీడీపీ తొలి జాబితాలో ప్రకటించిన విధంగా టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పేరును అభ్యర్థిగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ బిక్కవోలు మండలం కొంకుదురు గ్రామశాఖ అధ్యక్షుడు కర్రి వీర వెంకట సత్యనారాయణరెడ్డి అలియాస్ కలెక్టర్ బుధవారం గ్రామంలోని తన నివా సంలో నిరవధిక దీక్ష చేపట్టారు. దివంగత మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి మూలారెడ్డి చిత్రపటం వద్ద ఆయన దీక్షను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 42 ఏళ్లుగా నల్లమిల్లి కుటుంబం టీడీపీకి సేవలందించిందని, అనపర్తిలో విజయావకాశాలు ఉన్న టీడీపీని కాదని బీజేపీకి మార్చు చేయడం సరికాదన్నారు. అనపర్తి సీటును నల్లమిల్లికి మార్పు చేస్తూ ప్రకటన చేసే వరకు దీక్షను విరమించబోమన్నారు.

'టీడీపీ కండువాతో ప్రచారం చేయొద్దు'

అనపర్తిలో బీజేపీ అభ్యర్థి ప్రచారంపై టీడీపీ నాయకుల అభ్యంతరం


అభ్యంతరం వ్యక్తం చేస్తున్న టీడీపీ నాయకులు

బిక్కవోలు, ఏప్రిల్ 10: అనపర్తి బీజేపీ అభ్యర్థిగా ప్రకటించిన ఎం.శివరామకృష్ణంరాజు బుధవారం బిక్కవోలు నుంచి ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. అయితే ఆయన టీడీపీ కండువాలతో ప్రచారం ప్రారంభించడంతో పార్టీ గ్రామ అధ్యక్షుడు పాలచర్ల శివప్రసాద్‌చౌదరి ఆధ్వర్యంలో నాయకులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు తమ నేత నల్లమిల్లి రామకృష్ణారెడ్డిని అనపర్తి ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించారని, బీజేపీ నాయకులు రామకృష్ణంరాజును అభ్యర్థిగా ప్రకటించారని అయితే ఈ సీటుపై ఇంకా తర్జన భర్జనలు జరుగుతున్నాయని, అందువల్ల తమ పార్టీ కండువాలు కప్పుకుని ప్రచారం చేయవద్దని రాజుతో వాగ్వాదానికి దిగారు. రామకృష్ణారెడ్డి న్యాయం కోసం నల్లమిల్లికి అంటూ టీడీపీ కండువాలతోనే ప్రచారం చేస్తున్నారని, ఈ దశలో మీరు తమ పార్టీ కండువాలు కప్పుకుని ప్రచారం చేస్తే సహించబోమన్నారు. బీ-ఫారం ఎవరికి ఇస్తే అప్పుడు తామంతా వారి వెంటే ఉంటామన్నారు. దీంతో చేసేది లేక శివరామకృష్ణంరాజు కప్పుకున్న టీడీపీ కండువాను తీసి వేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుణ్ణం రమేష్, గొర్రెల త్రిమూర్తులు, రాయుడు రామచంద్రరావు, పెంటమాని వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీని గద్దె దించడమే లక్ష్యం: శివరామకృష్ణంరాజు

వైసీపీ అరాచక పాలనను గద్దె దించడమే కూటమి లక్ష్యమని అనపర్తి బీజేపీ అభ్యర్థి ఎం.శివరామకృష్ణంరాజు తెలిపారు. బుధవారం ఆయన బిక్కవోలులోని ప్రాచీన లక్ష్మీగణపతికి ప్రత్యేక పూజలు జరిపి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి తనకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. రాష్ట్రంలో, నియోజకవర్గంలో ఎన్డీఏ కూటమి, కేంద్రంలో బీజేపీ విజయం సాధించడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఆయన వెంట బీజేపీ నేతలు, కార్యకర్తలు ఉన్నారు.

భారీ చెప్పుల తయారీ


తయారు చేసిన భారీ చెప్పులతో చర్మకారుడు పెందుర్తి వెంకటేష్

మండపేట, ఏప్రిల్ 10: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేటకు చెందిన చర్మకారుడు పెందుర్తి వెంకటేష్ ఆరు అడుగుల ఎత్తు, మూడు అడుగుల వెడల్పుతో రెండు భారీ చెప్పులు తయారు చేశాడు. మండపేటలో ఒక చెప్పుల దుకాణం ప్రారంభించాలని నిర్ణయించిన ఒక వ్యక్తి ఇచ్చిన ఆర్డర్‌పై ఈ రెండు చెప్పులు తయారుచేసినట్టు వెంకటేష్ తెలిపాడు. షాపు ముందు డిస్‌ప్లే పెట్టడానికి ఈ చెప్పులు ఆ షాపు యజమాని తయారు చేయించాడు. రెండు చెప్పులు రెండు మోడల్స్‌లో తయారు చేసినట్టు వెంకటేష్ తెలిపాడు. ఒకటి వి టైపు, మరొకటి అత్తారింటికి దారేది సినిమాలో పవన్‌కల్యాణ్ వేసుకున్న మోడల్‌లో తయారు చేశాడు. ఈనెల రెండో తేదీ నుంచి వారం రోజులు రోజుకు మూడు గంటల చొప్పున శ్రమించి ఇద్దరి సహాయంతో ఈ చెప్పులు తయారుచేసినట్టు తెలిపాడు. చెప్పుల తయారీ కోసం రెక్సినా, పీఈఎల్ సోల్, లెదర్ వంటి మెటీరియల్‌ను ఉపయోగించినట్టు చెప్పాడు. ఒక్కో చెప్పు తయారు చేయడానికి రూ.5వేలు ఖర్చు అయిందన్నాడు. రాజారత్న సెంటరు సినిమా హాలు రోడ్డులో ఉన్న దుకాణం ముందు పెట్టిన అతిపెద్ద చెప్పులు అందరినీ ఆకట్టుకుంటున్నాయి.

అప్పన్న చందనోత్సవం

చీఫ్ ఫెస్టివల్ అధికారిగా రామచంద్రమోహన్



అన్నవరం, ఏప్రిల్ 10: వచ్చేనెల 10న జరిగే సింహాచలం అప్పన్న చందనోత్సవానికి చీఫ్ ఫెస్టివల్ అధికారిగా అన్నవరం దేవస్థానం ఈవో కె.రామచంద్ర మోహన్‌ను నియమిస్తూ దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తరాంధ్ర, ఇతర ప్రాంతాల నుంచి సుమారు రెండు లక్షల మంది విచ్చేసే ఈ ఉత్సవానికి భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాల్సి ఉంది. గతేడాది చందనోత్సవానికి భక్తులు ఎన్నో ఇబ్బందులు పడి సింహాద్రి అప్పన్న నిజరూప దర్శనం కలగకుండానే వెనుతిరిగి వెళ్లిపోవడం, ఏర్పాట్లపై అసంతృప్తి వ్యక్తం చేయడం తెలిసిందే. ఈ ఏడాది దేవదాయ శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. గతంలో సింహాచలం ఈవోగా పనిచేసి అనుభవం ఉన్న రామచంద్రమోహన్‌కు ఈ ఏడాది చీఫ్ ఫెస్టివల్ అధికారి బాధ్యతలను అప్పగించారు.


రాజమహేంద్రవరంలోని పెద్ద మసీదు



రాజమహేంద్రవరంలో రంజాన్ సందడి నెలకొంది. అన్ని మసీదులను రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు.. ప్రత్యేక ప్రార్థనలకు ఏర్పాట్లు చేశారు..
● రాజమహేంద్రవరం సిటీ

కాగుతున్న కొండలు

గ్రామాలను కమ్మేస్తున్న పొగ



వై.రామవరం,ఏప్రిల్10: అల్లూరి జిల్లాలోని అటవీ ప్రాంతాల చుట్టూ గత వారం పదిరోజులుగా కొండలు తగలబడుతున్నాయి. ఆ పొగలు గ్రామాల్లోకి వ్యాపించడంతో మన్యం వాసులు ప్రతీరోజు తీవ్రమైన కళ్ల మంటలతో సతమతమవుతున్నారు. ఎండలు మండుతున్న వేళ కొండల్లో సంచరించే స్థానికులు నిప్పు పెట్టడంతో అగ్నికి ఆజ్యం పోసినట్లుగా కొండల నుంచి కింద ఉన్న రహదారుల వరకు అగ్నిజ్వాలలు రగులుతున్నాయి. మొక్కలు, వివిధ రకాల పంటలు వేసుకుని జీవనాధారంగా బతుకుతున్న కొండపోడు రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని పలువురు ఆవేదన చెందుతున్నారు. అడవులను రక్షించండంటూ ప్రచారాల వరకే పరిమితమవుతున్న అటవీశాఖాధికారులు మంటలను అదుపు చేయడంలో చర్యలు తీసుకోవడం లేదని పలువురు గిరిజనులు ఆరోపిస్తున్నారు.



● అమలాపురం అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావు
● వన్నెచింతలపూడిలో జయహో బీసీ సదస్సు
● పలు చోట్ల టీడీపీలోకి చేరికలు

భక్తి ప్రపత్తులతో రంజాన్

అమలాపురంటౌన్, ఏప్రిల్10: స్థానిక 12వవార్డు ఇస్నా అసరీ మసీదులో ముస్లింలు రంజాన్ పండుగను బుధవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ప్రపంచ శాంతికోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మత గురువు మౌలానా హైదర్ ఆలీ రంజాన్ విశిష్టతను వివరించారు. పాలస్తీనాపై ఇజ్రాయిల్ జరుపుతున్న దాడులు,అకృత్యాలను అంతమొందించాలని ప్రార్థించారు. నెల వంకను చూసిన తర్వాత ఉపవాస దీక్షలు విరమించారు. మసీదు ధర్మకర్త మహ్మద్ నిస్సార్ హుస్సేన్, కార్యదర్శి కరార్‌హుస్సేన్ పాల్గొన్నారు.

చంద్రబాబు, పవన్ పర్యటనతో ట్రాఫిక్ మళ్లింపు



అంబాజీపేటలో సభా స్థలిని పరిశీలిస్తున్న పోలీసులు, అధికారులు

అంబాజీపేట, ఏప్రిల్ 10: అంబాజీపేట సెంటరు సమీపంలో గురువారం టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ బహిరంగ సభ నేపథ్యంలో గురువారం మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6గంటల వరకు ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నట్టు కొత్తపేట డీఎస్పీ కేవీ రమణ తెలిపారు. బుధవారం ఆయన సభా స్థలిని, హైస్కూలు ఆవరణలో హెలిపాడ్, పార్కింగ్ ప్రదేశాలను పరిశీలించారు. పి.గన్నవరం వైపు నుంచి అమలాపురం వెళ్లే వాహనాలను మాచవరం వద్ద నుంచి చిరతపూడి, అవిడి, ముక్కామల వైపు అమలాపురం మళ్లించారు. బోడసకుర్రు బ్రిడ్జి నుంచి పి.గన్నవరం, కొత్తపేట వైపు వెళ్లే వాహనాలు బేతాళస్వామి గుడి నుంచి మెట్ల కాలనీ మీదుగా మాచవరం వైపు వెళ్లాలి.

బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించిన డీఎస్పీ రమణ

అమలాపురం నుంచి పి.గన్నవరం వెళ్లే వాహనాలను గంగలకుర్రు మలుపు నుంచి ముక్కామల, అవిడి మీదుగా దారిమళ్లించారు. కొత్తపేట, అయినవిల్లి వైపు నుంచి వచ్చే వాహనాలు ముక్కామల, అవిడి వైపు నుంచి పి.గన్నవరం మీదుగా వెళ్లేలా ఏర్పాట్లు చేశారు. బహిరంగ సభకు వచ్చే వాహనాలను నిర్దేశించిన ప్రాంతాల్లో పార్కింగ్ చేయాలన్నారు. పి.గన్నవరం వైపు నుంచి వచ్చే వాహనాలను మాచవరం పంచాయతీ వద్ద ఉన్న ఖాళీ స్థలంలో పార్కింగ్ చేయాలి. అమలాపురం వైపు నుంచి వచ్చే వాహనాలను గంగలకుర్రు మలుపు వద్ద ఉన్న దొమ్మేటి వెంకట్రావు కొబ్బరితోటల్లో నిలపాలి. బోడసకుర్రు వైపు నుంచి వచ్చే వాహనాలను సాయికృష్ణ తల్లీపిల్లల ఆసుపత్రి పక్కన ఉన్న ఖాళీ స్థలంలో పార్కింగ్ చేయాలి. కొత్తపేట వైపు నుంచి వచ్చే వాహనాలను అంబాజీపేట బస్టాండు సమీపంలోని ప్రైవేటు లే-అవుట్‌లో పార్కింగ్ చేయాలని డీఎస్పీ సూచించారు. ఆయన వెంట సీఐ డి.ప్రశాంత్‌కుమార్, ఎస్ఐలు కె.చిరంజీవి, శివకృష్ణ ఉన్నారు. అంబాజీపేటలో హెలిపాడ్‌లను జడ్పీ సీఈవో, నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీరామచంద్రమూర్తి, తహసీల్దారు జె.విమలకుమారి, ఎంపీడీవో లక్ష్మి పరిశీలించారు.

9గంటల వరకు వాహనాలకు పట్టణంలోకి అనుమతి లేదు

అమలాపురం టౌన్, ఏప్రిల్ 10: టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పర్యటన సందర్భంగా గురువారం అమలాపురంలో నిర్వహించే బహిరంగ సభ నేపథ్యంలో ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నట్టు డీఎస్పీ ఎం.మహేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గడియార స్తంభం సెంటర్లో బహిరంగ సభ నేపథ్యంలో గురువారం సాయంత్రం 4నుంచి రాత్రి 9గంటల వరకు పట్టణంలోకి ఎటువంటి వాహనాలను అనుమతించమన్నారు. ముమ్మిడివరం నుంచి అమలాపురం మీదుగా రావులపాలెం వెళ్లే వాహనాలు కొండాలమ్మచింత మీదుగా క్రాప, కె.జగన్నాథపురం, తొత్తరమూడి, మడుపల్లి మీదుగా రావులపాలెం చేరుకోవాలి. ముమ్మిడివరం, ఉప్పలగుప్తం నుంచి రావులపాలెం వెళ్లే వాహనాలు అనాతవరం, మాగాం, ముక్తేశ్వరం, అయినవిల్లి, మడుపల్లి మీదుగా రావులపాలెం వెళ్లాలి. కాకినాడ నుంచి అమలాపురం మీదుగా రాజోలు వెళ్లే వాహనాలు భట్నవిల్లి బైపాస్ మీదుగా చిందాడగరువు, రోళ్లపాలెం, పేరూరు వై.జంక్షన్ మీదుగా రాజోలు చేరాలి. అమలాపురం నుంచి అంబాజీపేట, రావులపాలెం వెళ్లే టూవీలర్స్, ఆటోలు భట్లపాలెం బీవీసీ కళాశాల రోడ్డుమీదుగా సాకుర్రు, నందంపూడి మీదుగా వెళ్లాలి. బహిరంగ సభకు వచ్చే వాహనాలను ఈదరపల్లి వంతెన వద్ద లారీ యూనియన్ ఖాళీ ప్రదేశంలోను, నల్లవంతెన మీదుగా వచ్చే వాహనాలను ముస్లిం షాదీఖానా, మెట్ల రమణబాబు ఇంటి ప్రాంగణంలోను నిలుపుకోవాలి. ఎర్రవంతెన మీదుగా వచ్చే వాహనాలు వెంకటేశ్వరస్వామి గుడి ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలోను, పేరూరు మీదుగా వచ్చే వాహనాలను హైస్కూలు సెంటర్‌లోని ఉన్నతపాఠశాలల క్రీడా ప్రాంగణాల్లోను నిలుపుకోవాలి. రాష్ట్రమంతటా ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో పాటు సెక్షన్ 144,30 పోలీసు యాక్టు నిబంధనలు పాటించాలన్నారు. ద్విచక్ర వాహనాల సైలెన్సర్లు తీసి విన్యాసాలు చేస్తే చర్యలు తీసుకుంటామని డీఎస్పీ చెప్పారు.

సచివాలయ తాళం పగలుకొట్టిన అధికారులు



కొమరాజులంక సచివాలయానికి తాళం వేసి ఉండడంతో బయటే ఉండిపోయిన అధికారులు

రావులపాలెం, ఏప్రిల్ 10: రావులపాలెం మండలం కొమరాజులంక సచివాలయం తాళం వేసి ఉండడంతో సిబ్బంది బయటే ఉండిపోయారు. ఇద్దరు అధికారుల సమక్షంలో తాళాలు పగలుకొట్టి లోపలికి వెళ్లిన సంఘటన ఇది. సచివాలయ కార్యదర్శి సబిత ఫోన్ లిఫ్ట్ చేయకపోవడం, సర్పంచ్ చెప్పిన పని చేయకపోవడంతో ఈ నెల8న సచివాలయానికి తాళం పెట్టి గడియవేశారని ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. 9వ తేది ఉగాది సెలవు. బుధవారం సచివాలయ పని దినం అయినప్పటికి సిబ్బంది అక్కడకు వచ్చి తలుపులు తియ్యకుండా బయట ఉండిపోయారు. టీడీపీ నేతలు అక్కడికి చేరుకుని పది గంటలు దాటుతున్నా తలుపులు తెరవలేదు ఏమిటని ప్రశ్నించారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ రాజేష్ సిబ్బందితో అక్కడికి చేరుకుని తాళం పగలుకొట్టించారు. అనంతరం సిబ్బంది లోపలికి వెళ్లారు. ఈసందర్భంగా పలువురు టీడీపీ నాయకులు మాట్లాడుతూ గ్రామంలో నివాసం ఉంటున్న అడ్డగళ్ళ సూర్యకుమారికి అన్ని హక్కులతో కలిగిన రిజిస్టర్డ్ పత్రాలతో కూడిన నాలుగు సెంట్ల స్థలం ఉందన్నారు. ఇది 11ఏళ్లుగా ఆమె స్వాధీనంలో ఉన్నప్పటికీ ఆ స్థలం పంచాయతీదేనని, వెంటనే స్వాధీనం చేసుకోవాలని కార్యదర్శిపై వైసీపీ సర్పంచ్ ఒత్తిడి తెచ్చారన్నారు. కార్యదర్శి చర్యలు తీసుకోకపోవడంతో ఆగ్రహించిన సర్పంచ్ సచివాలయానికి తాళం వేశారని ఆరోపించారు. అయితే సర్పంచ్ తాళం వెయ్యలేదని కార్యదర్శి తెలపడంతో మరి తాళం ఎవరు వేశారని మరోమారు ప్రశ్నించారు. సచివాలయ గుమస్తా తాళం వేసి వెళ్లారని, ఆయన ఎక్కడో పడవేశారని కార్యదర్శి చెప్పారు. ఈవిషయాన్ని ఉన్నతాధికారులకు తెలపడంతో పోలీసుల సమక్షంలో తాళాలు మరమ్మతులు చేసే వ్యక్తితో పగలుకొట్టించి తీయించారన్నారు.

వాహనాలు తనిఖీ చేసిన పోలీసులు

రాయవరం,ఏప్రిల్10: సోమేశ్వరం - రాయవరం ప్రధాన రహదారిలో బుధవారం ఎస్ఐ జి.నరేష్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలను తనిఖీచేశారు. ఎన్నికల నిబంధనలు పాటించాలని, మద్యం రవాణా చేస్తే చర్యలు తప్పవన్నారు. ఏఎస్ఐ బి.వెంకటేశ్వరరావు సిబ్బంది పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం







అమలాపురం: మాట్లాడుతున్న అయితాబత్తుల ఆనందరావు, కొత్తపేట:వాడపాలెంలో బండారు సమక్షంలో టీడీపీలో చేరిన వారు, మండపేట: ఎమ్మెల్యే వేగుళ్ల సమక్షంలో టీడీపీలోకి చేరికలు

అమలాపురంరూరల్, ఏప్రిల్10: రాష్ట్రంలో టీడీపీ-జనసేన-బీజేజీ కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం తీసుకువస్తామని అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ కూటమి అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావు పేర్కొన్నారు. వన్నెచింతలపూడిలో టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు మల్లుల పోలయ్య అధ్యక్షతన బుధవారం జయహో బీసీ సదస్సు నిర్వహించారు. రాష్ట్రంలో జగన్ దుర్మార్గ పాలనను అంతం చేసేందుకు బీసీలంతా వెన్నుదన్నుగా నిలవాలని ఆనందరావు కోరారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి చంద్రమౌళి, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు పెచ్చెట్టి విజయలక్ష్మి, నాయకులు రాజులపూడి భీముడు, బొర్రా ఈశ్వరరావు, నడింపల్లి అర్జున్‌వర్మ, చొల్లంగి సత్యసాయిబాబా, పాలాటి బాలయోగి, యనమదల లక్ష్మి, యెరుబండి వెంకటేశ్వరరావు, దంతులూరి వాసురాజు, జనసేన నాయకులు లింగోలు పండు, కొప్పుల నాగమానస పాల్గొన్నారు.

'రాష్ట్రంలో సంపద సృష్టికర్త చంద్రబాబే'

అమలాపురం టౌన్, ఏప్రిల్ 10: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సంపదను సృష్టించిన ఘనత నాటి ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుందని టీడీపీ సీనియర్ నాయకుడు బోనం నాగేశ్వరరావు పేర్కొన్నారు. రాష్ట్ర విభజన అనంతరం సంపద సృష్టించడానికి ఎన్నో ప్రణాళికలకు రూపకల్పన చేయడంతో పాటు సంక్షేమ పథకాలను అమలుచేశారని వివరించారు. అమలాపురం నల్ల వంతెన వద్ద గల ఐఎస్సార్ హైట్స్‌లో బుధవారం జరిగిన సమావేశంలో నాగేశ్వరరావు మాట్లాడుతూ బీజేపీ, టీడీపీ, జనసేన కలయిక రాష్ట్రానికి శుభసూచకమన్నారు. జగన్ అరాచక పాలనకు విముక్తి కల్పించేందుకు కూటమి అభ్యర్థులకే ఓట్లు వేసి గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బీవీ ఫణికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాబోయేది కూటమి ప్రభుత్వమే

మలికిపురం, ఏప్రిల్ 10: రాబోయేది ఎన్డీయే ప్రభుత్వమని జనసేన రాజోలు అసెంబ్లీ అభ్యర్థి దేవ వరప్రసాద్ అన్నారు. విశ్వేశ్వరాయపురం, చింతలమోరి గ్రామాల్లో ముఖ్య నాయకులను కలిసి అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ పాలనలో అరాచకం రాజ్యమేలిందన్నారు. బడుగు, బలహీన వర్గాలకు తీరని అన్యాయం జరిగిందన్నారు. మాజీ సీఎం చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్, మోదీల నాయకత్వంలో రాష్ట్రానికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో విశ్వేశ్వరాయపురం సర్పంచ్ చెల్లుబోయిన హేలీన, హరికృష్ణ, గెద్దం సింహ, బాబుప్రసాద్ పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిక

కొత్తపేట, ఏప్రిల్ 10: వైసీపీ జొన్నాడ గ్రామ అధ్యక్షుడు గొలుగూరి ఈశ్వరరెడ్డి, మాజీ ఎంపీటీసీ గుత్తుల శ్రీనివాస్‌తో పాటు మరో ముగ్గురు బుధవారం వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. వాడపాలెం వద్ద జరిగిన కార్యక్రమంలో కూటమి అభ్యర్థి బండారు సత్యానందరావు వారికి టీడీపీ కండువాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో తాడి శ్రీనివాసరెడ్డి, గొడవర్తి దుర్గాప్రసాద్, సత్తి శ్రీనివాసరెడ్డి, తమలంపూడి రామకృష్ణారెడ్డి, ఎన్.నాగరాజు, దాసరి రాంబాబు, ద్వారంపూడి సతీష్‌రెడ్డి, దాసరి గణేష్, పట్టెం వీరబాబు, కృష్ణ పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే సంక్షేమం

కాట్రేనికోన, ఏప్రిల్ 10: చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలతోనే రాష్ట్రంలో సంక్షేమం సాధ్యమని ముమ్మిడివరం అసెంబ్లీ కూటమి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు అన్నారు. బుధవారం ఆయన గెద్దనపల్లి, కొప్పిగుంట, నడవపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయనకు అడుగడుగునా ప్రజలు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో జనసేన, టీడీపీ కార్యకర్తలు, వీరమహిళలు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

టీడీపీలో పలువురు చేరిక

మండపేట, ఏప్రిల్ 10: తెలుగుదేశం పార్టీలోకి బుధవారం పలువురు కాపు సామాజిక వర్గీయులు చేరారు. కపిలేశ్వరపురం మండలం అంగర గ్రామానికి చెందిన కాపు సామాజిక వర్గీయులు గంగ్రోతుల ధనబాబు, గంగ్రోతుల సూరిబాబు, దాసర వీరకృష్ణ, వరాల వీరబాబు, గంగుమళ్ల సుబ్రహ్మణ్యం, నంబుల రాజారాం, బండారు మూలస్వామి, చింతా కోటిలు బుధవారం టీడీపీ మండల నేత పుత్సల శ్రీనివాస్ సారథ్యంలో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు సమ క్షంలో స్థానిక టీడీపీ కార్యాలయంలో బుధవారం పార్టీలో చేరారు. వారికి వేగుళ్ల కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. చింతా అప్పన్న, గంగ్రోతుల పట్టాభి పాల్గొన్నారు.

సభకు తరలిరండి.. గెలిచేది మనమే..



ఉప్పలగుప్తం: టీడీపీ, జనసేన సంయుక్త ర్యాలీ

ఉప్పలగుప్తం, ఏప్రిల్ 10: వైసీపీ ఎన్ని కుట్రలు చేసినా వచ్చే ఎన్నికల్లో కూటమి విజయం తథ్యమని టీడీపీ-జనసేన-బీజేపీ నాయకులు వ్యాఖ్యానించారు. అమలాపురంలో గురువారం జరిగే చంద్రబాబు-పవన్ ప్రజాగళం సభకు భారీ సంఖ్యలో తరలిరావాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గొల్లవిల్లిలో బుధవారం టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు అరిగెల నానాజీ అధ్యక్షతన అమలాపురం అసెంబ్లీ కూటమి అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావు ఆధ్వర్యంలో కూటమి సమావేశం జరిగింది. తొలుత ఆనందరావు, జనసేన నాయకుడు ఇసుకపట్ల రఘుబాబు తదితరులు ర్యాలీగా సమావేశానికి వచ్చారు.టీడీపీ, జనసేన నాయకులు దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ, చిక్కం పెదబాబు, గుత్తుల నాగేశ్వరరావు, చీకట్ల ఏసు, నిమ్మకాయల పద్మావతి, బూసి బుజ్జిదొర, మద్దింశెట్టి సీతారామస్వామి, కంకటాల రామం, రవణం మధు, అయితాబత్తుల ఉమామహేశ్వరరావు, గుత్తాల సుభాష్‌చంద్రరావు, ఆకుల బుజ్జి, మారిశెట్టి రమేష్, మంచెం బాలకృష్ణ, మురమళ్ల శ్రీను, చిక్కం సూర్యమోహన్, చిక్కం భీముడు, బీజేపీ నాయకుడు గనిశెట్టి అరవింద్ పాల్గొన్నారు.

గొల్లవిల్లిలో కూటమి నాయకుల పిలుపు

సభకు తరలిరావాలి

ముమ్మిడివరం, ఏప్రిల్ 10: అమలాపురంలో గురువారం నిర్వహించే టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్‌ల బహిరంగ సభకు అధిక సంఖ్యలో పార్టీ నాయకులు కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలని ఏఎంసీ మాజీ చైర్మన్ గొలకోటి దొరబాబు పిలుపునిచ్చారు. టీడీపీ కార్యాలయంలో బుధవారం అర్థాని శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో దొరబాబు మాట్లాడారు. ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు దాట్ల బుచ్చిబాబు, గంటిహరీష్ మాధుర్‌లను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో తాడి నరసింహారావు, పొద్దోకు నారాయణరావు, నడిమింటి సూర్యప్రభాకరం, చిక్కాల అంజిబాబు, దొమ్మేటి రమణకుమార్, యాళ్ల ఉదయ్, దంగేటి శ్రీనివాస్, నడింపల్లి శ్రీనురాజు, గీసాల చంద్రరావు, బొంతు నాగరాజు, కురసాల శివబాబు, పళ్ల రాజబాబు, సత్తి నూకరాజు, అయినవిల్లి వలీబాబా, బొక్కా సత్తిబాబు, గోదశి గణేష్, చింతలపూడి కొండబాబు, కాశి లాజర్ పాల్గొన్నారు.

అధినేతల సభను విజయవంతం చేయాలి

అంబాజీపేట, ఏప్రిల్10: టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు, జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్‌లు అంబాజీపేటలో గురువారం నిర్వహించే బహిరంగ సభను విజవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పి.గన్నవరం అసెంబ్లీ అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ పిలుపునిచ్చారు. అంబాజీపేటలో బుధవారం జనసేన పార్టీ నాయకులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈసభకు నియోజకవర్గంలోని 64గ్రామాల నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు అధిక సంఖ్యలో తరలి రావాలన్నారు. అంబాజీపేట జరిగే సభ ప్రాంతాన్ని టీడీపీ, జనసేన, బీజేపీ జెండాలతో అలంకరించారు. జిల్లా ఉపాధ్యక్షుడు శిరిగినీడి వెంకటేశ్వరరావు, కార్యదర్శి వాసంశెట్టి కుమార్, ఎంపీటీసీ వాకపల్లి దొరబాబు, నాయకులు మద్దా చంటిబాబు, అరిగెల సూరిబాబు, చిటికెన నాని, మైపాల తాతాజీ, పితాని రామకృష్ణ, జాలెం శ్రీనివాసరాజా, నేదునూరి పెద్దిరాజు, సాధనాల శ్రీ వెంకటేశ్వరరావు, పోలిశెట్టి రాజేష్, వర్రే శేషు పాల్గొన్నారు.



అంబాజీపేట: మాట్లాడుతున్న అసెంబ్లీ అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ

విజయవంతం చేయండి

మండపేట, ఏప్రిల్ 10: అంబాజీపేట, అమలాపురంలో గురువారం జరిగే టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌లు పాల్గొనే సభలను టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు విజయవంతం చేయాలని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు పిలుపు ఇచ్చారు. ఈప్రచార సభలకు కార్యకర్తలు, నాయకులు తరలిరావాలని కోరారు.

సీ-విజిల్ యాప్‌తో ఫిర్యాదుల పరిష్కారం

అమలాపురం టౌన్, ఏప్రిల్ 10: సీ-విజిల్ యాప్ ద్వారా ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై పౌరులు చేసిన ఫిర్యాదులను సకాలంలో పరిష్కరిస్తున్నట్టు సీపీవో వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. ఈనెల9న 16 ఫిర్యాదులు రాగా వాటిలో మూడు ప్రవర్తనా నియమావళికి సంబంధించినవి కావని, మిగిలిన ఫిర్యాదులను పరిష్కరించామన్నారు. సీ-విజిల్ యాప్ ద్వారా ఇప్పటివరకు జిల్లాలో 364 ఫిర్యాదులు రాగా వాటిలో 80ఫిర్యాదులు నియమావళికి సంబంధించినవి కావని నిర్ధారించారు. మిగిలిన 284 ఫిర్యాదుల్లో 250 ఫిర్యాదులను వంద నిమిషాల్లోపు పరిష్కరించామన్నారు. మిలిగిన ఫిర్యాదులను సైతం పరిష్కరించినట్టు సీపీవో చెప్పారు.

రక్తదాన శిబిరం

అమలాపురం టౌన్, ఏప్రిల్ 10: పట్టణంలోని ఎర్రవంతెన దిగువన ఉన్న బుద్దాల మెమోరియల్ బ్లడ్ బ్యాంకులో దళిత సేన ఆధ్వర్యంలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. బీఆర్ అంబేడ్కర్ జయంత్యుత్సవాల్లో భాగంగా అంబేడ్కర్ చిత్రపటానికి డాక్టర్ కారెం రవితేజ, డాక్టర్ అంబేడ్కర్, రతన్‌బెనర్జీ నివాళులర్పించి కేక్ కట్ చేశారు. 25మంది యువకులు రక్తదానం చేశారు. కొంకాపల్లి హరిమనోవికాస కేంద్రంలో అన్నదానం నిర్వహించారు. దళితసేన అధ్యక్షుడు మెండి డేవిడ్ అంబేడ్కర్, పినిపే రవికుమార్, వాకపల్లి హరీష్, సాపే రమేష్, బత్తుల శ్రీను, దోనిపాటి నవీన్, చిత్రపు జయరాజ్, బొంతు ఉమ, మాదే విజయకుమార్ పాల్గొన్నారు.

నల్లా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో అన్నదానం

అమలాపురం టౌన్, ఏప్రిల్ 10: నల్లా చారిటబుల్ ట్రస్టు చైర్మన్ నల్లా పవన్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం అమలాపురం ఏరియా ఆసుపత్రిలో రోగులకు అన్నదానం నిర్వహించారు. సూపరింటెండెంట్ డాక్టర్ కె.శంకరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రతి నెల 9వ తేదీన అన్నదానం నిర్వహించేందుకు పవన్ ముందుకు వచ్చారు. కార్యక్రమంలో గనిశెట్టి అరవింద్, అయ్యల బాషా, యల్లమిల్లి నాగసుధాకొండ, సలాది నాగేశ్వరరావు, డాక్టర్ స్రవంతి, డాక్టర్ రత్నమణి, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయూ ఇఫ్తార్ విందు

అంతర్వేది, ఏప్రిల్ 10: సఖినేటిపల్లిలో ఎస్టీయూ మండల అధ్యక్షుడు గుబ్బల శ్రీనివాస్ అధ్యక్షతన బుధవారం ముస్లిం ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. మత పెద్ద బాషా ఇఫ్తార్ విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ నరహరిశెట్టి సత్యనారాయణ, రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్.శివప్రసాద్, కార్యదర్శి ఎస్ఎస్ పల్లంరాజు, ఎన్.సత్యనారాయణ, వీవీ సత్యనారాయణ, ముస్లింలు, ఉపాధ్యాయులు మహ్మద్ బషీర్‌బేగం తదితరులు పాల్గొన్నారు.

పిచ్చికుక్క స్వైరవిహారం.. నలుగురికి గాయాలు

ఆత్రేయపురం, ఏప్రిల్ 10: ర్యాలి శివారు బుల్లియ్యరేవులో బుధవారం ఓ పిచ్చికుక్క పశువుల పాక వద్ద ఓ దూడను గాయపరిచింది. అడ్డువచ్చిన నలుగురు రైతులను తీవ్రంగా గాయపరిచింది. బాధితులు కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరామ	: శ్రీరంగనీతులు
వెంకటరమణ	: బడేమియా చోటేమియా
శ్రీలలిత	: లవ్‌గురు
శేఖర్ స్క్రీన్-1	: గీతాంజలి మళ్లీ వచ్చింది
శేఖర్ స్క్రీన్-2	: మంజుమ్మల్ బాయ్స్
రమా	: డీజేటిల్లు స్క్వేర్
గణపతి	: ఓంభీమ్‌బుష్
వెంకటపద్మావతిస్క్రీన్-1	: ఫ్యామిలీ స్టార్
వెంకటపద్మావతి స్క్రీన్-2	: గాడ్జిల్లా అండ్‌కాంగ్

దళిత పథకాలను రద్దుచేసిన వైసీపీకి బుద్ధి చెప్పాలి

ముమ్మిడివరం, ఏప్రిల్ 10: దళిత పథకాలను రద్దు చేసిన వైసీపీకి ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని పలువురు నాయకులు పేర్కొన్నారు. బుధవారం టీడీపీ కార్యాలయంలో టీడీపీ మండల, నగర పంచాయతీ ఎస్సీసెల్ అధ్యక్షులు మిమ్మితి చిరంజీవి, గొల్లపల్లి గోపీల అధ్యక్షతన ఎస్సీ సెల్ సమావేశం జరిగింది. కూటమి అభ్యర్థులు గంటి హరీష్‌మాధుర్, దాట్ల బుచ్చిబాబులను అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు దళితులంతా కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ ఎస్సీసెల్ అధికార ప్రతినిధి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పొద్దోకు నారాయణరావు, నాయకులు అర్థాని శ్రీనివాసరావు, దొమ్మేటి రమణకుమార్, బొంతు నాగరాజు, ములపర్తి బాలకృష్ణ, ఇసుకపట్ల వెంకటేశ్వరరావు, కాశి రామచంద్రరావు, జనుపల్లి సత్యనారాయణ, కోరుకొండ శివ, కాశి లాజర్, గెద్దం శ్రీనివాసరావు, ఖండవల్లి ఏలియా, మెండి కృష్ణంబాబు, మెండి రాజశేఖర్ పాల్గొన్నారు.

'దళితుల నోట మట్టికొట్టిన జగన్'

ఉప్పలగుప్తం, ఏప్రిల్10: జగన్ ఐదేళ్ల పాలనలో దళితుల నోట్లో మట్టికొట్టారని జనసేన దళిత నాయకులు ఆరోపించారు. చల్లపల్లిలో బుధవారం జనసేన నాయకుడు ఇసుకపట్ల రఘుబాబు అధ్యక్షతన దళితుల సమావేశం జరిగింది. రద్దు చేసిన సంక్షేమ పథకాలు అమలు కావాలంటే కూటమిని గెలిపించుకోవలసిన బాధ్యత దళితులపై ఉందని రఘుబాబు అన్నారు. అయితాబత్తుల ఉమామహేశ్వరరావు, సర్పంచ్‌లు ఇసుకపట్ల జయమణి, వాకపల్లి ఈశ్వరీసత్యనారాయణ, ఎంపీటీసీ దోనిపాటి బాలమ్మ, సాకా రాంబాబు, జంగా శ్రీను, ఇసుకపట్ల నరేష్, ఇసుకపట్ల బాబు పాల్గొన్నారు.

డూండీ రాకేష్‌పై జరిగిన దాడికి నిరసన

మామిడికుదురు, ఏప్రిల్ 10: విజయవాడ అర్బన్ ఆర్యవైశ్య సంఘ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో డూండీ రాకేష్‌పై వెల్లంపల్లి శ్రీనివాస్ అనుచరులు దాడి చేయడం అమానుష చర్య అని లూటుకుర్రులో టీడీపీ నాయకులు నిరసన చేపట్టారు. దాడికి పాల్పడిన వెల్లంపల్లి అనుచరులపై, ఏకపక్షంగా వ్యవహరించిన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మొల్లేటి శ్రీనివాస్, బోనం బాబు, గంధం భాస్కర్, తులా బాబ్జి, చుట్టుగుళ్ల కిశోర్, కడలి నూకరాజు, కొమ్ముల నందిబాబు, కోలా రాంబాబు, పాటి గోవిందు, కొల్లు ఏడుకొండలు పాల్గొన్నారు.

నేడు యానాంలో సీఎం ఎన్నికల ప్రచారం

యానాం, ఏప్రిల్ 10: యానాంలో ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు ఆధ్వర్యంలో ఎన్డీయే అభ్యర్థి నమశ్శివాయకు మద్దతుగా గురువారం సీఎం ఎన్.రంగసామి ప్రచారం చేస్తారు. సీఎం, ఎన్డీయే అభ్యర్థి, ప్రస్తుత హోం మంత్రి నమశ్శివాయ, ప్రజాపనులశాఖ మంత్రి లక్ష్మీనారాయణ, రాజ్యసభ సభ్యుడు సెల్వగణపతిరానున్నారు. బుధవారంరాత్రి 11గంటలకురోడ్డు మార్గనా బయలుదేరి సీఎం బృందం గురువారం మధ్యాహ్నం యానాంచేరుకుంటుంది.. మధ్యాహ్నం 3గంటలకు మల్లాడి నేతృత్వంలో నమశ్శివాయకు మద్దతుగా మోటార్‌సైకిల్ ర్యాలీ నిర్వహిస్తారు. ఎమ్మెల్యే గొల్లపల్లి అశోక్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న కార్యకర్తల సమావేశంలో సీఎం బృందం పాల్గొంటుంది.

నమశ్శివాయకు మద్దతుగా బీజేపీ ప్రచారం

యానాం, ఏప్రిల్ 10: పుదుచ్చేరి లోక్‌సభ ఎన్డీఏ అభ్యర్థి ఎ.నమశ్శివాయకు మద్దతుగా బుధవారం బీజేపీ యానాం శాఖ అధ్యక్షుడు కనకాల రాజు ఆధ్వర్యంలో ఫరంపేట, అయ్యన్ననగర్, కురసాంపేటలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కేంద్రలో, రాష్ట్రంలో బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం అవుతుందన్నారు. నమశ్శివాయను యానాం నుంచి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వారు ఓటర్లను కోరారు. కార్యక్రమంలో నాయకులు డీవీవీ సత్యనారాయణ, కనకాల రామదాసు, సబ్బతి లోకేశ్వరరావు, సంపత్, లంకే లోవరాజు, శ్యామ్, పోతుల శివకృష్ణా, నాయకులు, మహిళ మోర్చ, యువజన సంఘ సభ్యులు పాల్గొన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి వి.వైద్యలింగానికి కాంగ్రెస్ పార్టీ యానాం ఇన్‌చార్జ్ మల్లాడి సత్తిబాబు నేతృత్వంలో ఓల్డ్‌రాజీవ్‌నగర్, జీఎంసీ బాలయోగినగర్, గణపతినగర్ తదితర ప్రాంతాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలోని అంశాలను వివరించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జబర్దస్త్ టీమ్ సందడి



మామిడికుదురు, ఏప్రిల్ 10: మామిడికుదురు గ్రామదేవత నూకాలమ్మ జాతర మహోత్సవాల్లో మంగళవారం రాత్రి జబర్దస్త్ టీమ్ సందడి చేసింది. అశోక్, బాబి, వినోదిని తదితరులు పంచ్ డైలాగులతో ప్రేక్షకులను నవ్వుల్లో ముంచెత్తారు. చిన్నారులు, మహిళలు సెల్ఫీలు తీసుకోవడానికి పోటీ పడ్డారు.

రాష్ట్ర ప్రయోజనాల కోసమే కూటమి

అంతర్వేది, ఏప్రిల్10: రాష్ట్ర ప్రయోజనాల కోసమే టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీలు పొత్తు పెట్టుకున్నాయని, అందరూ కలసికట్టుగా పనిచేసి కూటమి అభ్యర్థులను గెలిపించాలని కూటమి రాజోలు అసెంబ్లీ అభ్యర్థి దేవ వరప్రసాద్ కోరారు. బుధవారం రామేశ్వరంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులను కలిసి గ్రామసమస్యలు అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గంలో ఉన్న ప్రతీ గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకే కలిసికట్టుగా అందరూ కృషిచేయాలన్నారు. చెల్లింగి శ్రీనివాస్, అల్లూరి రామకృష్ణ, గుబ్బల ఫణికుమార్, ముప్పర్తి నాని, సమన్వయకర్త గుండుబోగుల పెద్దకాపు, తాడి సత్యనారాయణ, అల్లూరి రంగరాజు, రామకోటి, పాటబళ్ల సూరిబాబు, జనసేన, బీజేపీ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

'అంబేడ్కర్ విలువ తెలిసేలా చేస్తా'

రావులపాలెం, ఏప్రిల్ 10: ఏగ్రామంలో అయితే అంబేడ్కర్‌కు అవమానం జరిగిందో ఆ గ్రామంలోని వైసీపీ నేతలకు అంబేడ్కర్ విలువ తెలిసేలా చేస్తానని కొత్తపేట అసెంబ్లీ కూటమి అభ్యర్థి బండారు సత్యానందరావు పేర్కొన్నారు. మండలంలోని గోపాలపురంలోబుధవారం ఆయన జనసేన ఇన్‌చార్జి బండారు శ్రీనివాస్, తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణలతో కలిసి ప్రజాగళం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలో పర్యటించి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అమలుచేసే పథకాలను ప్రజలకు వివరించారు. ట్రస్టు భూముల విషయంపై తప్పుడు ఆరోపణలు చేయడం తప్ప తేల్చే దమ్ము జగ్గిరెడ్డికి ఉందా అని సవాల్ విసిరారు.

టీటీఆర్ జయంతి వేడుకలు

ముమ్మిడివరం, ఏప్రిల్10: ప్రముఖ పారిశ్రామికవేత్త, సినీనిర్మాత తాడి తాతారావు జన్మదిన వేడుకలను కుటుంబ సభ్యులు, అభిమానులు, పలువురు నాయకులు ఘనంగా జరుపుకున్నారు. బుధవారం టీటీఆర్ ఘాట్‌లో తాతారావు విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా పలుసేవా కార్యక్రమాలను కుటుంబ సభ్యులు అమలుచేశారు. కుమారులు తాడి నరసింహారావు, జానకీరామ్, అల్లాడి రమణీకుమారి, తాడి పెదనరసింహారావు, తాడి కాశీవిశ్వేశ్వరరావు, కోలా సాయిబాబు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంత ఖాతాదారులకు సేవలు

అంబాజీపేట, ఏప్రిల్ 10: గ్రామీణ ప్రజలకు సేవలందించేందుకు చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు కృషిచేస్తుందని బ్యాంకు రీజనల్ మేనేజర్ పి.శ్రీనివాస్ అన్నారు. పుల్లేటికుర్రులో 266వ బ్రాంచ్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. తక్కువ వడ్డీకి రుణాలు అందిస్తామన్నారు. సర్పంచ్ జల్లి బాలరాజు, ప్రాంతీయ కార్యాలయం ప్రణాళిక అధికారి అధికారి రామారెడ్డి, క్రెడిట్ అధికారి రత్నకుమార్, బ్రాంచ్ మేనేజర్ ఎస్.అరుణ్‌నెహ్రూ పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడు నాగేశ్వరరావు మృతి



ముమ్మిడివరం, ఏప్రిల్ 10: టీడీపీ ఎస్సీ సెల్ మండల మాజీ అధ్యక్షుడు, ప్రముఖదళిత నాయకుడు దాసరి నాగేశ్వరరావు(48) బుధవారం అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. ఆయనకు భార్య బాలయోగీశ్వరి కుమారుడు, కుమార్తె ఉన్నారు. నాగేశ్వరరావు దళిత ఉద్యమాల్లోను, రిపబ్లికన్ పార్టీలోను, తెలుగుదేశం పార్టీలోను అనేక సేవలు అందించారు. టీడీపీ అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు, పార్లమెంటు అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్, సర్పంచ్ నాతి అలివేలు, మాజీ సర్పంచ్‌లు పెట్టా సుధాకర్, మోర్త వీరసూర్యం, నాయకులు చెల్లి అశోక్, గ్రామ సర్పంచ్ గీసాల దుర్గతో పాటు పలువురు నాగేశ్వరరావు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

'కాంగ్రెస్ టిక్కెట్' స్థానికులకే కేటాయించాలి

మామిడికుదురు, ఏప్రిల్ 10: పి.గన్నవరం నియోజకవర్గ కాంగ్రెస్ టిక్కెట్‌ను స్థానికులకే కేటాయించాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్సీసెల్ కోఆర్డినేటర్ నీలిపూడి బాలసత్యనారాయణమూర్తి కోరారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నాలుగు దశాబ్దాలుగా పార్టీకి సేవలందిస్తున్న తనకు టిక్కెట్ కేటాయించాలని, పార్టీ పెద్దలు సహకరించాలని కోరారు. అంతేకాకుండా పార్టీ టిక్కెట్ ఎవరికి కేటాయించినా ఆ నిర్ణయమే శిరోధార్యంగా భావించి వారి విజయానికి పూర్తిగా సహకరిస్తానని తెలిపారు.

హోమియో వైద్య పితామహుడు హనిమన్ జయంతి

మండపేట, ఏప్రిల్ 10: హోమియో వైద్య పితామహుడు డాక్టర్ హనిమన్ అని ప్రముఖ హోమియో వైద్యులు డాక్టర్ చల్లా రవికుమార్ అన్నారు. స్థానిక గౌతమి హోమియో ఆసుపత్రిలో బుధవారం హనిమన్ 270వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి డాక్టర్ చల్లా నివాళులర్పించారు. ప్రపంచంలో 80దేశాల్లో హోమియో వైద్యం వినియోగంలో ఉందన్నారు. డాక్టర్ మెహర్‌ప్రసన్న, డాక్టర్ నాగదేవి, చైతన్య పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన

ఆత్రేయపురం, ఏప్రిల్ 10: ప్రజాస్వామ్యంలో ఓటు కలిగిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు ఎం.పట్టాభి రామయ్య కోరారు. బుధవారం ఆత్రేయపురంలోని ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద రైతులు, కూలీలు, లారీ డ్రైవర్లకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఆర్ఐ భవాని, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

కపిలేశ్వరపురం, ఏప్రిల్ 10: అంగర పీహెచ్‌సీలో వైద్యాధికారిణి డా. జె.అనూజప్రియాంక బుధవారం 25మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. రక్త పరీక్షలు చేసి మందులను అందజేసారు. గర్భిణులు తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో జె.మల్లికార్జునుడు, హెచ్ఈ బి.రామారావు, టి.మేరీమణి, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కోట, కోటిపల్లిలో పోలీసుల కవాతు

కె.గంగవరం, ఏప్రిల్10: కోట, కోటిపల్లి గ్రామాల్లో మంగళవారం రాత్రి డీఎస్పీ రామకృష్ణ, సీఐ దొరరాజు, ఎస్ఐ జానీబాషా ఆధ్వర్యంలో పోలీసులు కవాతు నిర్వహించారు. ఓటర్లకు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఓటు ఆవశ్యకతను వివరించారు. నిర్భయంగా ఓటు వేయాలని సూచించారు.

ద్రాక్షారామ: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ద్రాక్షారామ, భీమక్రోసుపాలెం, తోటపేట గ్రామాల్లో బుధవారం పోలీసులు కవాతు నిర్వహించారు. ద్రాక్షారామ పోలీస్ స్టేషన్ నుంచి మెయిన్‌రోడ్డు వరకు కవాతు జరిపారు. సీఐ దొరరాజు, ఎస్ఐ సురేంద్ర, ఎస్ఎఫ్ సీఐ బెటాలియన్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా అమ్మవార్ల జాతరలు

కె.గంగవరం, ఏప్రిల్10: తామరపల్లిలో గోగులమ్మ, పాణింగపల్లిలో పట్టాలమ్మ, కూళ్లలో దాక్షాయణమ్మ జాతరలు మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. జాతర్లలో సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. బుధవారం ఆయా గ్రామాల్లో తీర్థాలు జరిగాయి. భక్తులు అమ్మవార్లను సందర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

వైసీపీలోకి మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి

మామిడికుదురు, ఏప్రిల్ 10: మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి బుధవారం సీఎం జగన్ సమక్షంలో వైసీపీలో చేరారు. 2004, 2009లో పి.గన్నవరం నుంచి కాంగ్రెస్ పార్టీ తరుపున ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2014 కాంగ్రెస్ నుంచి 2019 జనసేన నుంచి పోటీచేసి పరాజయం పాలయ్యారు. కుమారుడు పాముల దేవిప్రకాష్‌తో పాటు తన అనుచరులతో కలిసి వైసీపీలో చేరారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

పి.గన్నవరం, ఏప్రిల్ 10:నాగుల్లంక పీహెచ్‌సీలో వైద్యాధికారి డాక్టర్ మౌనికామణి ఆధ్వర్యంలో, పి.గన్నవరం సీహెచ్‌సీలో డాక్టర్ ఎస్.సంధ్యా రాణి ఆధ్వర్యంలో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. నాగుల్లంకలో ఫౌండర్ ఫ్యామిలీట్రస్ట్ బోళ్ల వీరాస్వామి సత్రం ఆధ్వర్యంలో, పి.గన్నవరంలో వేణి ఫౌండేషన్ చైర్మన్ నల్లా గంగాఈశ్వరరావు ఆధ్వర్యంలో గర్భిణులకు భోజనాలు అందించారు. సీహెచ్‌సీ సూపరింటెండెంట్ పి.కోటేశ్వరరావు, ఎంపీహెచ్ఈవో ఎ.నాగరాజు, పీహెచ్ఎన్ ఎ.కె.దుర్గాబాయి, మరియమ్మ, గణేశుల కొండలరావు, నల్లా పెద్దకాపు, కర్రి బాబూరావు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.